క్లుప్తంగా

నిబద్ధతతో విధులు నిర్వహించాలి



నియామక పత్రాన్ని అందిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: ఉన్నతాధికారులను సూచించిన విధులను నిబద్ధతతో నిర్వర్తించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సూచించారు. మండలంలోని భట్లపాలిక శివారు రావిదొడ్డిపేటలో అంగన్‌వాడీ సహాయకుల పోస్టుకు అర్హత సాధించిన మోర్త నందినికి సోమవారం సాయంత్రం రామచంద్రపురం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద నియామక పత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు మెరుగైన ఆహారం అందించడంతో పాటు విద్యాబుద్ధులను నేర్పించాలని సూచించారు. పార్టీ నాయకులు కట్టా తిరుమల, మోర్త చంద్రరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

కె.గంగవరం: మండలంలోని రెండు గ్రామాల్లో నేడు జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కోట, కూళ్ల గ్రామ సచివాలయాల వద్ద ఈ క్యాంపు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. లబ్ధిదారులు ఎటువంటి ధ్రువపత్రాలు కావాలన్నా క్యాంపుల వద్ద దరఖాస్తు అందిస్తే ఒక్క రోజులోనే ఉచితంగా పత్రాలు అందిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



డెంగీ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

కాజులూరు: డెంగీ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సీవీఎల్ శ్రేయ అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది గ్రామంలో ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహించి డెంగీ జ్వరాలు సోకే విధానం, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ శ్రేయ మాట్లాడుతూ దోమల ఉధృతి కారణంగా డెంగీ విషజ్వరాలు ప్రబలేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు ఎ.వైకుంఠరావు, వై.నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


పేకాడుతున్న 13 మంది అరెస్టు

మండపేట: మండలంలోని ఏడిద సీతానగరం – చింతాలమ్మ గుడి రోడ్డులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం మండపేట రూరల్ పోలీసులు దాడి చేశారు. 13 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.62,250 నగదు, ఆరు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చింతాలమ్మ గుడి రోడ్డులోని ఒక గెస్ట్‌హౌస్‌లో పేకాట జరుగుతున్నట్టు అందిన సమాచారంతో ఎస్‌ఐ బి. శివకృష్ణ సిబ్బంది కలిసి దాడి చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాపీ మేస్త్రీల సంఘ నేత పరమేశ్ మృతి

కపిలేశ్వరపురం: అంగర గ్రామ పెద్ద, తాపీ మేస్త్రీల సంఘం నాయకుడు ముత్తా పరమేశ్ సోమవారం మృతి చెందారు. ఈయన దీర్ఘ కాలం పాటు తాపీమేస్త్రి వృత్తి చేస్తూ అంగర, పడమర ఖండ్రిక, తదితర గ్రామాల్లో అందమైన భవనాలను నిర్మించి పేరు తెచ్చుకున్నారు. ఆయా గ్రామాలకు చెందిన అనేక మందిని నైపుణ్యత గల తాపీమేస్త్రీలుగా తయారు చేశారు. ఆయన మృతికి ఇరు గ్రామాల ప్రజాప్రతినిధులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కోతకు గురవుతున్న వంతెన అప్రోచ్



మల్లవరం వద్ద కొట్టుకుపోయిన వంతెన అప్రోచ్

కె.గంగవరం: మండలంలోని కూళ్ల పంచాయతీ శివారు మల్లవరం వద్ద ఉన్న వంతెన అప్రోచ్ కోతకు గురవుతుంది. దీంతో వంతెనకు ఇరువైపులా అప్రోచ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో ఇక్కడ వాహనాలు కాలువలోనికి పల్టీ కొడుతున్నాయని స్థానికులు అంటున్నారు. గత నెలలో మల్లవరం మీదుగా కోటిపల్లి వెళుతున్న ఇద్దరు యువకులు ఈ వంతెన వద్ద ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. తరచుగా ఈ ప్రాంత వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెన వద్ద అప్రోచ్ కొట్టుకుపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

ఊపందుకున్న వరినాట్లు

- రెండు రోజులుగా కురుస్తున్న వర్షం
- ఖరీఫ్ పనుల్లో రైతులు, కూలీలు బిజీ



రామచంద్రపురంలో నాట్లు వేసే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రామచంద్రపురం: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు ఊపందుకున్నాయి. వాతావరణం అనుకూలించక పోవటంతో ఈ ఖరీఫ్‌లో వరినాట్లు ఆలస్యమయ్యాయి. సాధారణంగా జూలై రెండో వారం నాటికి ఖరీఫ్‌లో వరినాట్లు పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఈ సారి సమయం మించిపోతున్నా ఈ ఏడాది వేసవిలో విపరీతమైన ఎండలుతో పాటు వర్షాభావ పరిస్థితులు కూడా అనుకూలంగా లేకపోవటంతో వరినాట్లు ఆలస్యమయ్యాయి.

ఏటా ఖరీఫ్‌లో రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల పరిధిలో 51,920 ఎకరాలు, మండపేట నియోజకవర్గంలోని మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల పరిధిలో 48500 ఎకరాల్లోను వరిసాగు చేస్తుంటారు. సాధారణంగా జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ పనుల్లో రైతులు బిజీగా ఉండేవారు. జూన్‌లో నారుమడులు పూర్తి చేసుకుని జూలై రెండో వారం నాటికి నాట్లు పూర్తి చేసేవారు. ఖరీఫ్‌లో 70 శాతం వరకు నాట్లు వేస్తుంటే మిగిలిన 25 శాతం వెదజల్లు విధానంలో సాగు చేస్తుంటారు. కానీ ఈ ఏడాది జూన్ నెలతో పాటుగా జూలైలోను ఎండలు మండిపోయాయి. కురవాల్సిన సమయం కన్నా ఆసల్యంగా వర్షాలు రావటంతో నాట్లు వేయటం ఆలస్యమయింది. జూన్ నెలలో వరినాట్లు వేయడానికి రైతులు భయపడ్డారు. ఎండ వేడిమికి నాట్లు ఎండిపోయతాయనే సంశయంతో నాట్లు వేయటం ఆసల్యం చేశారు. వర్షాభావ ప్రభావంతో పంట చేలలో నీళ్లు లేక నాట్లు వేసినా గానీ నారు రావటం ఆలస్యం కావటంతో ఊడ్పులు సాగదు. రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రతి జూలై మొదటివారం నాటికి సుమారుగా 50 నుంచి 60 శాతానికి, మండపేట నియోజకవర్గంలో 90 శాతం పైగా నాట్లు పూర్తి చేసేవారు. కానీ ఈ సారి రామచంద్రపురం నియోజకవర్గంలో 6 శాతం మించినాట్లు వేయలేదు. ఉదాహరణకు రామచంద్రపురం మండలంలో 18,130 ఎకరాలు వరిసాగు చేస్తుండగా ఈనెల మొదటి వారం ముగిసే సమయానికి 600 ఎకరాల్లో నాట్లు వేశారు. అందులో 500 ఎకరాల్లో ఊడ్పులు ఊడ్పగా 100 ఎకరాల్లో వెదజల్లారు. అలాగే మండపేట నియోజకవర్గంలో జూలై మొదటివారం నాటికి 15 శాతం మాత్రమే నాట్లు పూర్తి చేశారు. సాధారణంగా మండపేట పరిసర ప్రాంత రైతులు వర్షాధారం కాకుండా బోర్ల ద్వారా కూడా ఊడ్పులు ఊడుస్తుంటారు. కానీ ఈ సారి ఎండ వేడిమికి ఎడిపోతాయనే అనుమానంతో నాట్లు వేయటం ఆలస్యం చేశారు.

చురుగ్గా నాట్లు

గత రెండు రోజులుగా చల్లటి వాతావరణంతో పాటుగా వర్షాలు కూడా కురుస్తుండటంతో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. జూలై మూడో వారం పూర్తి కావచ్చే సమయానికి దాదాపుగా 70 శాతం వరకు నాట్లు పడే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఏటా ఖరీఫ్ ముగిసే సమయానికి తుపాన్ల ప్రభావం అధికంగా ఉంటున్న నేపథ్యంలో వరినాట్లు వేయటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు రైతులకు సూచనలు చేస్తున్నారు. ఇప్పటికే రెండు నియోజకవర్గాల్లోను ఖరీఫ్‌లో కావాల్సిన ఎరువులను రైతులకు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచారు.

త్వరితగతిన నాట్లు వేయాలి



జూన్‌లో ఎండలు అధికంగా ఉండటంతో రైతులు నాట్లు వేసేందుకు వెనుకగుడు వేశారు. ఎండ వేడమికి నాట్లు ఎండిపోయే అవకాశం లేకపోవటంతో నాట్లు వేయటం 20 రోజుల పాటు ఆలస్యమైంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రైతులు వరి నాట్లు త్వరితగతిని పూర్తి చేసుకోవాలి. ఆగష్టు మొదటి వారం నాటికి కాగా నాట్లు పూర్తి చేసుకుంటే సీజన్ ముగిసే సమయంలో వచ్చే తుపాన్ల భారి నుంచి బయట పడే అవకాశం ఉంది. రైతులకు కావాల్సిన ఎరువులు రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయి.

– ఎస్.సత్యప్రసాద్, మండల వ్యవసాయాధికారి

వలస వచ్చినా సంక్షేమ పథకాలు



జీవితంలో తొలిసారిగా పొందిన రేషన్‌కార్డును చూపిస్తున్న కాపురరామ్, దరియ కుటుంబం (ఫైల్)



రామచంద్రపురం రూరల్: ఊరూరు తిరుగుతూ దేవతా విగ్రహాలు చేసి వాటిని అమ్ముకుని కడుపు నింపుకునే బావరి కాపురరామ్, బావరి దరియా దంపతుల కుటుంబం ఎప్పుడూ రేషన్ కార్డు ముఖం ఎరుగరు. సీఎం జగన్ నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ద్వారా వారికి రేషన్ కార్డు మంజూరు కావడంతో పాటు వారికి, వారి పిల్లలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతూ ఆనందంగా జీవిస్తున్నారు. రాజస్థాన్ నుంచి పిల్లలతో పాటుగా వచ్చి 17 సంవత్సరాలుగా ద్రాక్షారామ, జగన్నాయకులపాలెం గ్రామాల్లో నివాసం ఉంటూ తమ వృత్తితో జీవనం సాగిస్తున్నారు. అయితే గతంలో రేషన్ కార్డు కూడా లేని వారికి జగన్నాయకులపాలెం వలంటీర్ సాదే రాజేష్ వారికి దగ్గరుండి రేషన్ కార్డు చేయించడంతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి సక్రమంగా అందేలా కృషి చేస్తున్నాడు. దీనితో ఆ ఇంటి పిల్లలు చక్కగా పాఠశాలకు వెళ్లి చదువుకోవడంతో పాటు వారి జీవనం సాఫీగా సాగుతోంది.

రాజేష్ మా కుటుంబానికి అండగా నిలుస్తున్నాడు



రాజస్థాన్ నుంచి వచ్చి దేవుడి బొమ్మలు చేసుకుని జీవనం సాగిస్తున్న మాకు వలంటీరు సాదే రాజేష్ అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నాడు. పొరుగు రాష్ట్రం వారిమైనా ఈ ప్రభుత్వంలో మాకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయంటే మా వలంటీరే కారణం. ఆధార్ కార్డు, రేషన్ కార్డు అతనే దగ్గరుండి మాకు ఆ కార్డులు ఇప్పించాడు. ఎప్పుడూ చదువుకునే అవకాశం లేని మా పిల్లలు ఇప్పుడు చదువుకుంటున్నారంటే అతనే కారణం అతనికి, అతడిని నియమించిన ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– బావరి దరియ, జగన్నాయకులపాలెం

ఓటరు సర్వే శాస్త్రీయంగా చేపట్టాలి

- నియోజకవర్గ ఈఆర్ఓ డీఎం సుధాసాగర్



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఈఆర్ఓ సుధాసాగర్

కపిలేశ్వరపురం: క్షేత్ర స్థాయిలో చేపట్టిన ఓటరు సర్వే శాస్త్రబద్ధంగా నిర్వహించాలని మండపేట నియోజకవర్గ ఈఆర్ఓ, జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం సుధాసాగర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఓటరు సర్వేపై సమీక్ష జరిపారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు మండలంలోని పరిస్థితిపై వివరించారు. బూత్ లెవెల్ అధికారులు, వీఆర్వోలు, ఏఆర్ఓలకు సుధాసాగర్ పలు సూచనలు చేశారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణ, తొలగింపు ప్రక్రియలపై సంబంధిత సిబ్బందికి తగిన అవగాహన అవసరమన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామికమైన రాజ్యాంగబద్ధమైన హక్కు అన్నారు. చనిపోయినవారి ఓటును పూర్తి స్థాయిలో నిర్ధారణ అయ్యిన తర్వాతనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాలాజీ, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ పక్కాగా చేపట్టాలి

రాయవరం: మండలంలో ఓటర్ల జాబితా సవరణను పక్కాగా చేపట్టాలని తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు బూత్ లెవల్ అధికారుల(బీఎల్‌వో)కు సూచించారు. మండల పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం ఓటర్ల జాబితా సవరణపై బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ–2024లో భాగంగా డోర్ టు డోర్ సర్వే సర్వే నిర్వహించాలన్నారు. ఓటర్ల సవరణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో ఈఆర్వో సుధాసాగర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సాగు నీరందించాలి

కాజులూరు: శివారు భూములకు సాగు నీరందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కాజులూరు, అయితపూడి, తదితర గ్రామాల్లో కౌలురైతు సంఘం నాయకులు ప ర్యటించి దుగ్గుదుర్రులో నీరు లేక ఎండిపోయిన వరి పొలాల్లో రైతులతో కలసి ఆందోళనలు నిర్వహించారు.

మంత్రి వేణు స్నేహపూర్వక వాతావరణం సృష్టించారు



సీఎం జగన్, మంత్రి వేణు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రామచంద్రపురం నియోజకవర్గంలో స్నేహపూర్వక వాతావరణం సృష్టించారని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు ప్రకటించారు. రామచంద్రపురం ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అంబటి భవాని మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలంగా ఉండటంతో కొందరు గందరగోళం సృష్టించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. మంత్రి వేణు పూర్వం నుంచి వైఎస్సార్ వెంట ఉన్న తమతో పాటు తెలుగుదేశం నుంచి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో పాటు పార్టీలో చేరిన వారిని కలసిమెలసి ఉండేలా చేసి స్నేహ రామచంద్రపురాన్ని సాధించారన్నారు. వైస్ ఎంపీపీ శాకా బాబీ మాట్లాడుతూ గతంలో ప్రత్యర్థులుగా ఉండి ఎక్కడైనా కనిపిస్తే కనీసం మాట కలపడానికి కూడా ఇష్టపడని వాతావరణం నుంచి ప్రస్తుతం అన్నదమ్ముల్లా అందరూ కలసి పార్టీ బలోపేతానికి కలసి పనిచేసే వాతావరణం రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి వేణు కల్పించారన్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తూ పదవులు ఇవ్వడంతో పాటు తమకు కూడా ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, సర్పంచ్‌లు కట్టా గోవిందు, అంబటి తుకారం, వీరబోయిన సూరిబాబు, పెమ్మిరెడ్డి దొరబాబు, నాయకులు దడాల రవికుమార్, పెంటపాటి శ్రీను, కంచుమర్తి బాబూరావు,వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడే కొందరిని మంత్రి వేణు దూరం పెట్టడంతో వారు పార్టీలో గందళగోళం సృష్టించాలని చూస్తున్నారన్నారు. అటువంటి వారిని ఎదుర్కోడానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సీఎం జగన్ నాయకత్వం, మంత్రి వేణు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

ట్రాన్స్‌ప్లాంటేషన్ మెషీన్‌తో వరినాట్లు



సోమేశ్వరంలో ట్రాన్స్‌ప్లాంటేషన్ మెషీన్‌తో వరి నాట్లు వేస్తున్న రైతులు

రాయవరం: సాగులో ఆధునిక పోకడలను అమలు చేయాలని వ్యవసాయ శాఖ ఇప్పటికే సూచిస్తోంది. అందులో భాగంగా మండలంలోని సోమేశ్వరంలో పలువురు రైతులు మెషీన్ ట్రాన్స్‌ఫ్లాంటేషన్ విధానంలో వరినాట్లు వేశారు. ఈ విధానంలో ముందుగా ప్రత్యేకమైన బెడ్డింగ్‌లో విత్తనాలు వేసి నారును ట్రేలలో పెంచుతారు. ఇలా పెంచిన నారును ట్రాన్స్‌ప్లాంటేషన్ మిషన్ సాయంతో వరినాట్లు వేస్తారు. ఈ విధానంలో నిర్దిష్టమైన కొలతతో వరినాట్లు వేయడానికి అవకాశం ఉంటుంది. దీని వలన విత్తనం, కూలీలు, సమయం ఆదా అవుతుందని ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. మిషన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విధానంలో సుమారు 200 ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ ఆరిఫ్, సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి పలువురు రైతులు ఆసక్తిగా తిలకించారు.

ముగిసిన అశిరాంబ అమ్మవారి జాతర



అశిరాంబ అమ్మవారు

కపిలేశ్వరపురం: అంగర గ్రామదేవత అశిరాంబ అమ్మవారి జాతర ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ నిర్వహణకు సహకరించిన ఇరు గ్రామాల భక్తులకు ఆలయ నిర్వాహక కమిటీ నాయకులు రాగం రామచంద్రరావు కృతజ్ఞతలు తెలిపారు. అంగర ఎస్సై జి.చంటి ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మండపేట తపాలా ఉద్యోగుల సేవలు భేష్



సూర్యనారాయణ, షరీఫ్‌లను సత్కరిస్తున్న కోమల్‌కుమార్

మండపేట: మహిళల ఆర్థిక భరోసా కోసం పోస్టల్ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా వారికి ప్రయోజనం చేకూర్చడంలో మండపేట పోస్టల్ ఉద్యోగుల సేవలు అభినందనీయమని రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.కోమల్ కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో మంగళవారం ఆయన మండపేట హెడ్ పోస్టాఫీసుకు వచ్చారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో అత్యధిక సేవింగ్స్ ఖాతాలు ఓపెన్ చేయించిన మండపేట పోస్టల్ ఉద్యోగులు కొండపల్లి సూర్యనారాయణ, ఎండీఎం షరీఫ్‌లను కోమల్ కుమార్, పోస్టుమాస్టర్ శ్రీనివాస్ రెడ్డి ఘనంగా సత్కరించారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్‌లను కలిసి పోస్టల్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. రిటైర్డ్ పోస్టుమాస్టర్ టపా పుల్లేశ్వరరావు, పోస్టల్ ఉద్యోగులు కేవీ నారాయణరావు, కె.జానకి, కె. ఈశ్వరరావు, సీహెచ్ శ్రీనివాస్, సీహెచ్ రామరాజు, అనూష, ఎస్.దుర్గాదేవి, జి. వెంకట్రావు పాల్గొన్నారు.

పేదల కోసమే 'జగనన్న సురక్ష'

- అందరికీ పథకాల లబ్ధి
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



చెల్లూరులో వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



కపిలేశ్వరపురం సభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు

రాయవరం: పేదలందరికీ పథకాల లబ్ధి అందించాలనే ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని చెల్లూరు, సోమేశ్వరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల నుంచి పాఠశాల విద్యార్థుల వరకూ ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. అవినీతికి, తావు లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. అయినా ప్రతిపక్షాలకు, పచ్చ మీడియాకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం కన్పించడం లేదా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులు మాట్లాడారు. అనంతరం జగనన్న జగనన్న సురక్షలో మంజూరైన సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా సేవా మిత్ర అవార్డులతో 63 మంది వలంటీర్లను సత్కరించారు. సర్పంచులు పాలిక రాఘవ, ఆరిఫ్, ఎంపీటీసీ వైట్ల వీరవేణి, కాళ్ల అప్పారావు, సొసైటీ ఛైర్మన్లు చిక్కాల శ్రీరాములు, నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెర్నిపాడులో..

మండపేట: గత పాలకుల మాటలకే పరిమితమైన ప్రజల వద్దకు పాలనను ఆచరణలో అమలుచేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అన్నారు. మెర్నిపాడులో మంగళవారం సర్పంచ్ గారపాటి సౌజన్య అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నేత గారపాటి అశోక్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఎంపీపీ శ్రీనివాస్, అశోక్‌కుమార్, సర్పంచ్ సౌజన్యలు సర్టిఫికెట్లు అందజేశారు. తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు అడ్డాల శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి వర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వై వెంకటలక్ష్మి, సత్యనారాయణ, చిటికెన వీర్రాజు, ముత్యాల రామారావు పాల్గొన్నారు.

స్థానికంగానే సమస్యల పరిష్కారం

కపిలేశ్వరపురం: వలంటీర్, సచివాలయ వ్యవస్థలు వచ్చాక ప్రజల సమస్యలు స్థానికంగానే పరిష్కారం అవుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అన్నారు. కపిలేశ్వరపురం సర్పంచ్ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, కపిలేశ్వరపురం – 01 సచివాలయ కన్వీనర్లు కొల్లాటి రత్నకుమారి, కురుపూడి విజయ్, తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డిలతో కలిసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పీతల బంగారం, అరదాని శ్రీదేవి, అంగాని నూకరాజు, గ్రామ కార్యదర్శి , వంగా శ్రీనివాస్, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఇరువురికి గాయాలు

మండపేట: పుట్టిన రోజు వేడుకకు హాజరైన తమపై ఆరుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచినట్టు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన చింతా కల్యాణ్‌కుమార్ సోమవారం రాత్రి స్నేహితుని పుట్టినరోజు వేడుకకు వెళ్లాడు. అక్కడికి తన స్నేహితులు కత్తుల వెంకటేష్ (హర్ష), సుబ్బు కారుపై వేగంగా వచ్చి సడన్ బ్రేక్ వేయగా వివాదం తలెత్తింది. ఈ ఘటనలో నీలపాల కాశి, తుట్టపు దుర్గాప్రసాద్, పెండ్యాల సుబ్బరాజు, సాయిరాం, తిప్పా ప్రసాద్, ముత్తులు దాడి చేయడంతో హర్ష, తనకు తీవ్ర గాయాలైనట్టు కల్యాణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ ఎం.అశోక్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలన్నదే సురక్ష ఉద్దేశం



తోటపేటలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి వేణు, ఇతర ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలన్నదే జగనన్న సురక్ష ఉద్దేశమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని తోటపేటలో మంగళవారం జగనన్న సురక్షలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలియకో, అవగాహన లేకో ఏ ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని పొందకుండా ఉండకూడదని, ప్రతి ఒక్కరినీ వలంటీర్ల ద్వారా, కమిటీల ద్వారా వ్యక్తిగతంగా కలుసుకుని వారి అవసరాలు తెలుసుకుని తీర్చే విధంగా రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రికి ఉన్న బాధ్యతను తెలియజేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ నాలుగేళ్లలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రూ.26.89 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. అదే విధంగా గ్రామ అభివృద్ధి పనులకు రూ.3.49 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. అనంతరం గ్రామంలో జగనన్న సురక్ష పథకం ద్వారా గ్రామస్తులకు ఉచితంగా మంజూరు అయిన 882 వివిధ ధ్రువీకరణ పత్రాలను మంత్రి వేణు, ఇతర ప్రజాప్రతినిధుల ద్వారా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అల్లం తాతాజీ, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ), మార్కెట్ కమిటీ ఛైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, పీఏసీఎస్ ఛైర్మన్ దామిశెట్టి చంద్రశేఖర్, మండల వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ దామిశెట్టి సత్యనారాయణ మూర్తి, ఎంపీటీసీ రెడ్నం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు చిత్తశుద్ధితో పని చేయాలి

కొత్తపేట: ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రజారోగ్య పరిరక్షణకు వైద్యులు, సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి (డీఎం అండ్‌హెచ్‌ఓ) ఎం.దుర్గారావు దొర సూచించారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. స్థానిక డివిజన్ అధికారి ఎం.సుమలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎం అండ్‌హెచ్‌ఓ పాల్గొని పీహెచ్‌సీల వారీగా అన్ని కార్యక్రమాల ప్రగతిని, జాతీయ ఆరోగ్య ప్రోగ్రాంల అమలు తీరుపై సమీక్షించారు. ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందిస్తూ డివిజన్ పరిధిలో అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు డాక్టర్ జాన్‌లేవి, డాక్టర్ శివగాయత్రి, పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.